

ఆదివారం.

రొటీన్ నించి చేంజ్ కోరుతూంది మ...

"పావు తక్కువ ఏడు" అంటూంది.

వేషం కూడా మార్చాలనిపించి, చాకలి తెచ్చిన లక్నోవీ కుర్తా, పైజామా తీసి వేసుకున్నాను.

మూడు నెలలు కష్టపడి పెంచిన మీసాలు, గెడ్డం నా రూపాన్ని కొద్దిగా మార్చాయి.

"సయ్యద్ ముస్తఫ్ అలీలా ఉన్నావు', అంటూంది అద్దం.

నడక మొదలు పెట్టాను.

కిళ్ళీ దుకాణంలో విల్స్ ఫ్లేక్ కొని, ఇంకా ... వెలిగించి, క్షణం ఆలోచించాను.

ఎక్కడికి వెళ్ళడం?

సుల్తాన్ నియాజీ ఇంటికి వెళితేనో?

కోడిపులావ్, బిర్యానీ, బీరు—ఇంకా,

తిండికి కూడా ఛేంజ్.

కానీ, ఆరు మైళ్ళు నడవగలనా?

తీరా నే వెళ్ళినా, ఆ రాస్కెల్ ఇంట్లో ఉంటాడా?

పోనీ, రిక్షాలో పోతే?

రిక్షావాలా ఆరు రూపాయలు గుంజాడని కాకపోయినా, రెండు గంటల సేపు ఫూల్ లాగ ఒంటరిగా రిక్షాలో 'అరెస్ట్' అయి కూర్చోవాలి.

ఫామిలీ ప్లానింగ్ సెంటర్‌లో పనిచేసే డాక్టరమ్మకి పిల్లల్లేనట్లు ఇంత పెద్ద సిటీలో బస్సులు లేవు. టాక్సీ సౌకర్యం అంతంతమాత్రం.

మెడమీద పురుగు ఏదో కుట్టింది. నెమ్మదిగా వేళ్ళతో తడిమి చూశాను. ఉప్పురు కట్టే చిన్న పసరు మండింది.

స్ట్రీట్ లైట్ చుట్టూ దీపం పురుగులు తిరుగుతున్నాయి గుండ్రంగా.

"ఆ దీపపు నీడల అందాలు తప్ప ఏమీ అందవు నా చిన్ని రెక్కల ఆసక్తికి. ఆ చిన్న దీపం చుట్టూ తిరిగే పురుగుని నేను."

"ప్రేమించినందుకు రెండే ఫలితాలు. శాశ్వతమైన ప్రేమతో జీవితం వెలగాలి; లేకపోతే విరహంలో కాలిపోవాలి. అంతేకానీ, ధనము, సుఖము, భోజనము— ఇవన్నీ కలిగి బతకటం ఎందుకు?

గుడిపాటి గురువు గారి బోధ.

చలం.

అరుణాచలం.

కహాఁహై ... కహాఁ ... ఎక్కడ?

ఎన్నివేల మైళ్ళ దూరంలో?

కానీ, నా నరనరాల్లో నీ 'గీతోపదేశం' ప్రవహిస్తూంది.

ఇంతకీ నే నెందుకు బతుకుతున్నట్లు! ఆర్జిస్తున్నాను. తింటున్నాను. తిరుగుతున్నాను. కానీ ... కానీ, శారద లేని జీవితం...ఎందుకు? శారదని పొందటానికి ముందు శారద జబ్బు నయం కావాలి. శానటోరియమ్‌లో శారద. మదనపల్లిలో మందులు, ఇంజెక్షన్స్, మాత్రలు.

కోడిగుడ్డు, వెన్న, పాలు, ఏపిల్స్.

"ఏన్ ఏపిల్ ఎ డే కీప్స్ ద డాక్టర్ ఎవే."

'ద డాక్టర్ ఎండ్ ద ఏపిల్ ఆర్ కీపింగ్ మై శారదా ఎవే ...'

చుట్టూ పరికించి చూశాను.

ఎదురుగా గోడమీద ఎర్రత్రికోణం.

"ఏక్ కె బాద్ అభీ నహీ
తీన్ కె బాద్ కభీ నహీ."

ఇంకా చూడు నాలుగు వైపులా.

సెక్స్ ప్రోబ్లెమ్స్?

కన్సల్ట్ డాక్టర్.

"స్టూడియో గ్లామర్..."

(తాయ్ రుపియా మే తీన్ కాపీ ).

"ఇరిట్ హోటల్ ఖయామ్..." (బార్ ఆటాచ్‌డ్).

రాక్సీలో — "గుప్తజ్ఞాన్..."

ఆ స్కూటర్ వెనక కూర్చున్నామెలో శారద పోలికలు కనిపిస్తున్నాయి.

శారద ... నన్ను ప్రేమించినందుకు శానటోరియమ్‌లో శిక్షని అనుభవిస్తూంది.

శారద ... శారద శరీరానికి శానటోరియమ్‌లో రెస్టు.

శారద హృదయానికి రెస్టుగా ఉందో, లేదో?

"రెస్టు, టానిక్కులు, పళ్ళు, వెన్న, పాలతో తెగ బలిసిపోతున్నా" నంటూ వ్రాసింది శారద.

అంటే, శరీరం పెరిగిపోతూ, తన అందాన్ని తగ్గించేస్తూందని బాధకాబోలు!

చొక్కలింగం ఆమధ్య శారదని చూడటానికి వచ్చి శారదకి ఫొటో తీశాడట.

---

**యోగ్యులైనవారిని చూస్తే క్షుద్రులు అసూయతో దహించుకొని పోతారు. అయోగ్యులను తాము కూడా అనుసరించాలని మహాత్ములు కోరుకొంటారు.**

**—కిప్లింగ్**

---

శారద ఫొటోలో నిజంగా లావుగానే కనిపిస్తూంది.

కానీ, శారద ఎన్‌ఛాంటింగ్ ఐస్, ఆ కళ్ళ క్రింద నీడలు, నన్ను నన్నుగా ప్రేమించే శారద విశాల హృదయం, 'కేర్‌ఫుల్ కేర్‌లెస్‌నెస్'గా తయారవగలిగే శారద నేర్పు నన్ను కళ్ళెం వేసి, శారద వైపు లాగుతాయి.

"చక్కటి బుజాల సౌందర్యం నాకు కావాలంటే, నేను ఆ బుజాల్ని మాత్రం కొనుక్కోవటానికి వీలులేదు. ఆ బుజాలతో బాటు తక్కిన అందం ఏమీ లేని ఆ స్త్రీని, ఆమె చీకిరి కళ్ళని, వంకర నడుముని కూడా తెచ్చుకోవాలి. శరీరం అంతా అందంగా ఉన్న స్త్రీతోబాటు ఆమె గర్వమూ, రాకాసితనమూ, చంచలత్వమూ కూడా కొనుక్కోవాలి కదా? పైగా, కొన్ని దేశాల్లో ఆమె పిల్లల్నికూడా తెచ్చి పోషించాలి. ఈ అవయవాలన్నీ యంత్రపు భాగాల్లాగ ( స్పేర్ పార్ట్స్ ) దొరుకుతూ ఉంటే ఈ లోకంలో సమస్యలు చాలా అంతమవుతాయి" అంటారు గురువుగారు.

గురువుగారి అమృత వచనాల్లో ఎంత నిజం!

ముందు శారద జబ్బు తగ్గటం కొరకు మందులు, తిండి, రెస్టు.

తరవాత శారదఒళ్ళుతగ్గటంకొరకు... డయటింగ్ చేయించటమా? లేక యోగా క్లాసెస్‌లో జాయిన్ చేయిస్తేనో?

ఏదో గుర్రపు డెక్కల సవ్వడి.

నా దగ్గరికే వచ్చి ఆగింది ఒక ఎక్కాబండి.

అందులోని ప్రయాణీకులు ఎక్కావాడితో సహా ముగ్గురు.

ఏభయ్యోపడిలో ఉన్న ఒక ముస్లిమ్. అతని వెంట ఒక బురఖా సుందరి. వాళ్ళిద్దరూ ఎక్కాకి రెండు వైపులా బద్దీలపై కూర్చుని ఉన్నారు.

పలచటి చర్మం గుండా 'రిబ్స్' కనిపిస్తూ గుర్రం.

నీలంరంగు గళ్ళ లుంగీ, కాలరులేని చేతులున్న తెల్లటి మాసిన జుబ్బా, నల్లటి టోపీ — ఇది ఎక్కావాడి వేషం.

"ఆయియే, జనాబ్, కహాఁ తక్ జానా హై ?" ఎక్కావాడి ప్రశ్న.

"లాల్ బంగ్లా. తక్ జానాహై."

నా జవాబు.

ఎక్కావాడు బండి దిగి, ఆ ముసలి ముండాకొడుకుని మధ్యలో అడ్డుగోడలా కూర్చోపెట్టి, రెండు వైపులా ఉన్న బద్దీల మీద ఆ బురఖా సుందరి, నేను కూర్చునేలా తలగడాలను పరిచేశాడు.

నేను ఎక్కా ఎక్కి కూర్చున్నాను.

ఆ బురఖా బ్యూటీ సర్దుకుని కూర్చోవటంతో ఆమె చేతుల కున్న ఎర్రని గాజులు గలగల మన్నాయి.

• • •

బెడ్ టీ అందిస్తున్న సుమ చేతులకి పసుపు పచ్చని గాజుగాజులు.

"ఎర్రటి గాజులు నీ చేతులకి ఇంకా బాగుంటాయి, సుమా" అన్నాను నేను కప్పుని అందుకుంటూ.

ఆ మరునాడే సుమ ఎర్రని గాజులు కొని మరీ వేసుకుంది.

'నీ ఎర్ర చీర కూడా కట్టుకోకూడదా, సుమా' అన్నాను నేను ఆమె చేతులని ఆప్యాయంగా నొక్కుతూ.

---

## సి. ప్రేమజప్రసాద్

---

ఏ కళనుందో సుమ వెళ్ళి చీర మార్చుకుని వచ్చింది.

నుదుట సిందూర తిలకం.

నేను అప్రయత్నంగా సుమని నా గుండెలకి దగ్గిరగా హత్తుకోబోయాను.

అంతే. సుమ నా కళ్ళముందే తన చేతులనున్న ఎర్రటి గాజులని ముక్కలు ముక్కలుగా విరిచి పారేసింది.

చీరని కాల్చేస్తానంది,

నేను సుమ చేతులని చిమ్మిన ఎర్రటి రక్తాన్ని నా రుమాలుతో తుడుస్తూ లాజికల్‌గా అడిగాను:

'సుమా, నీకు నా మీద నిజంగా ప్రేమ అనేది లేకపోతే ఎర్రటి గాజులు ఎందుకు కొని వేసుకున్నావు? చీరని ఎందుకు మార్చుకున్నావు?'

నాకు తెలుసు — సుమకి సులభంగా అబద్ధాలు చెప్పటం చేతకాదు.

సుమ నోటిమీదుగా శివరామ్ చెప్పిన నా ఆత్మకి సంతృప్తినిచ్చే జవాబుని వినాలని ఆశ.

సుమ నా కళ్ళలోకి సూటిగా చూసింది.

'నిజమే. నీ ఇచ్ఛకి నే నెందుకు దాసినయాను?

నేను నిన్ను ప్రేమిస్తూ ఉండవచ్చు. నువ్వు నా మీద కనపరుస్తున్న ప్రేమ కూడా నాకు ఆనందాన్నే ఇస్తూంది.

కానీ ... కానీ, నేను శివరామ్‌కి అన్యాయం చేయలేను.

నేను ఒక వేళ నిన్ను ప్రేమిస్తున్నా, నీ నించి నే నేమీ వాంఛించటం లేదు. ప్లీజ్ ఫర్‌గెట్ మీ.

యూ ప్లీజ్ గో ఎవే.

నేను శివరామ్‌కి, నువ్వు శారదకి అన్యాయం చేయకూడదు. గో ఎవే ... రాజా, గో ఎవే' అంటూ భోరున ఏడ్చింది సుమ.

• • •

"ఆప్ కా నామ్?" ఖారాకిల్లీ నోట్లో ఉండగానే ఆ ముసలతను నన్ను అడిగాడు.

"సయ్యద్ ముస్తఫ్ అలీ." వచ్చి అబద్ధాన్ని ఎంత సహజంగా చెప్పగలిగాను!

'నువ్వు ఊసరవెల్లిలా ఇట్టే రంగులు మార్చగలవు' అని అంటూ ఉంటుంది నన్ను నన్నుగా ప్రేమించే శారద.

దట్ ఈజ్ మై వీక్‌నెస్; లేక అదొక ఆర్టా?

శారద . . . శారదలోని ఆకర్షణ నన్ను తిప్పి, తిప్పి తిరిగి శారద వద్దకే చేరుస్తూంది.

ఆకర్షణ ... ఆకర్షణ అంటేనో?

అది ఒక సెంటర్ ఆఫ్ గ్రావిటీ లాంటిది.

శారద ఈజ్ మై సెంటర్ ఆఫ్ గ్రావిటీ.

ఇంకో విధంగా చెప్పాలంటే భూమ్యాకర్షణ శక్తి.

న్యూటన్ సిద్ధాంతం.

నేను ఎగరవేయబడిన బంతిని.

ఎసురుతున్నంతసేపూ నాకు హద్దులు లేవనుకుంటాను.

కానీ ... కానీ, నేను చివరకు శారద ఒడిలో ఒదిగిపోతూ ఉంటాను.

శారద ఒడిలో బందీని నేను,

బికాజ్ షీ ఈజ్ మై డెస్టినీ.

బురఖా పిల్ల కదిలినట్లయింది, గాజులు గలగల మన్నాయి.

నేను చూసీ చూడనట్లుగా ఆమె వైపు చూశాను.

అలా చూడటంలో నేను ఎక్స్‌పర్ట్‌ని (ఎగో కాదుకదా!)

ఆమె పెదవులు నవ్వీ నవ్వనట్లుగా విచ్చుకున్నాయి (అలా నవ్వటంలో ఆమె ఎక్స్‌పర్ట్‌లా ఉంది!)

ఆమె సౌందర్యాన్ని దాచలేని ఆమె ముఖం ముందరి పలచటి షిఫాన్ పరదా గుండా వెన్నెల ఆమె బుగ్గలని తాకుతూ ఉంటే, ఆమె కళ్ళలోని వెలుగు, కళ్ళ క్రింద నీడలు మసక మసకగా కనిపిస్తున్నాయి.

వెలుగు నీడల వినోదం.

* * *



వెన్నెల.

వెలుగు నీడలు.

మోతీ ఝీల్.

ఖాళీ సిమెంటు బెంచీలు.

చలి.

చీర పమిటని ముసుగులా కప్పుకుని కూర్చుంది సుమ. సుమకి ఎడంవైపున మున్నా, కుడివైపున నేను కూర్చున్నాం. సుమకి మరింత దగ్గరగా జరగబోయిన నా కళ్ళకు సుమ తొడల మీద లేతగా, తెల్లగా మున్నా చిన్ని చెయ్యి కనిపించి, సుమకి మున్నాని ప్రసాదించిన శాల్తీని నేను కాననీ, అంతేకాదు, ఆ శాల్తీ శివరామ్ — నా బెస్ట్ ఫ్రెండనీ గుర్తుకు వచ్చి నా కోర్కెని కళ్ళెం బిగించి ఆపాను.

నిశ్శబ్దం.

'సుమా!'

ఏమిటన్నట్లు చూసింది సుమ నాకేసి.

''టాక్ సమ్‌థింగ్.'

'ఏం మాట్లాడను?'

'సుమా, డిడ్ యూ అండర్‌స్టాండ్?'

'చలేస్తోంది. లెట్స్ హేవ్ ఎ కప్ ఆఫ్ కాఫీ.' సుమ నడుస్తోంది మున్నాని ఎత్తుకుని.

వెనక నేను.

స్వీట్ ఇండియా కేఫే లోనికి ప్రవేశించాం.

స్టీరియోలో హరేరామ, హరేకృష్ణ మ్యూజిక్కు.

లేత నీలం బల్బు కాంతి.

కార్నర్ టేబిల్ ఆకుపై చేశాం.

వాతావరణం రొమాంటిక్‌గా ఉంది.

మున్నా పాప్‌కార్న్ తింటున్నాడు.

ఎస్ప్రెసో కాఫీ నురగలు.

సుమ కొద్దిగా వణుకుతూంది.

'చలిగా ఉందా, సుమా?'

'అందుకే హాట్‌గా కాఫీ ...' తేలిగ్గా నవ్వేసింది సుమ.

నేను అప్రయత్నంగా నా ఓవర్ కోట్‌ని సుమ బుజాలమీదుగా కప్పాను.

సుమ 'నాట్ నెససరీ' అంటూ కోటుని తిరిగి నాకు ఇవ్వబోయింది.

నా కోటు బొత్తాం సుమ పమిట అంచుకు వ్రేలాడే పట్టుకుచ్చులలో చిక్కుకుంది.

సుమ ఎంతగానో ప్రయత్నించి వాటిని విడదీయలేక చివరకు పమిటను చింపేసుకుంది.

నా కోటు బొత్తాముకి ఆరెంజి కలరు పట్టు దారాలు.

నల్లని బొత్తాంకి ఆరెంజి కలరు దారాలు.

కాకి ముక్కుకి దొండపండు.

శివరామ్ ... సుమ ...

''సుమా, డిడ్ యూ అండర్‌స్టాండ్ ...'

మౌనం.

కాఫీ తాగటం అయింది.

'సుమా, షాల్ కప్పుకోమంటే విన్నావు కావు.'

'నీ శాలువకీ, నా చీరకీ మేచ్ కుదరలేదు.'

'యూ లైక్ ఎవ్విరిథింగ్ టు మేచ్, సుమా! బట్ ... పోనీ, సుమా, మన స్నేహానికి చిహ్నంగా నీ కొక శాలువ నేను ప్రెజెంట్ చేస్తాను. లెట్స్ గో ఫర్ షాపింగ్.'

'నో, థాంక్స్.'

'ప్లీజ్, సుమా. డోంట్ బీ సో రూడ్ ...'

'ఎప్పటికయినా నా కోర్కెలు శివరామ్ తప్పక తీరుస్తాడు. నాకా నమ్మకముంది.'

'జలుబు చేసి జబ్బు చేస్తేనో? అసలే నీ ఆరోగ్యం అంతంతమాత్రం.'

'ఫరవాలేదు, డాక్టర్లు ఉన్నారు.'

'డాక్టర్‌కి మాత్రం బిల్ పే చెయ్యటా్దా?' (నేనేనా అంత బ్రూటల్‌గా అడిగినది?)

'మిడిల్ క్లాస్ పీపుల్‌కి డాక్టర్ల వద్ద కూడా ఖాతా ఉంటుంది.'' కుండ బద్దలు కొట్టింది సుమ.

'నువ్వు ఎన్నుకున్న జీవితంలో నీ హేపీ, సుమా.'

'వాట్ డూ యూ మీన్, రాజా? నేను శివరామ్‌తో సుఖంగా లేనని నీ అభిప్రాయం? శివరామ్ ఏమిటో నాకు తెలుసు. నా ఆత్మకి తెలుసు. శివరామ్ నన్ను హృదయపూర్వకంగా ప్రేమించాడు. ప్రేమిస్తున్నాడు. శివరామ్ ప్రేమతో నా జీవితం దివ్యంగా వెలుగుతోంది. నేను ప్రేమించిన వ్యక్తితో జీవితాన్ని నేను ఎన్నుకుని ఉండి ఉంటే..

రాజా, ప్రేమించటంలో పొందే బాధని గురించి శారదని అడుగు. ప్రేమింపబడటంలో పొందే ఆనందాన్ని గురించి నన్ను అడుగు. నీకు నేను కొత్తగా ఏం ప్రేమ పాఠాలు నేర్పను?

ఐయామ్ క్వయిట్ కన్‌టెన్‌టెడ్ విత్ శివరామ్.

ఐ నో ద రియల్ వేల్యూ ఆఫ్ శివరామ్.

హీ ఈజ్ సో అండర్‌స్టాండింగ్.

హీ లవ్స్ మీ సో మచ్.

రాజా. ''శివరామ్ నాకు తగడు'' అన్న నీ అభిప్రాయాన్ని రివర్సు గేరు వేసి మార్చు.

నేనే శివరామ్‌కి తగను, శివరామ్‌కి నేనే తగను. తగను...తగను...' అంటూ భోరున ఏడ్చింది సుమ.

* * *

ఎక్కావాడు బీడీ తీసి వెలిగించాడు.

''స్మోక్ ప్లీజ్'' అంటూ ముసలతను నాకో సిగరెట్ ఆఫర్ చేశాడు.

'షుక్రియా' అని నేను సిగరెట్ తీసుకున్నాను.

ఎక్కా వాడు గీసిన అగ్గిపుల్లతో రెండు సమిధలూ వెలిగాయి.

''మీ పేరు?'' కర్టెసీ కోసం అడిగాను ముసలతనిని.

''అన్వర్ హుస్సేన్.'' పొడిగా దగ్గి, సిగరెట్టు పొగని గుండెల నిండా పీల్చి, ముక్కులోంచి పొగని బయటికి వదులుతూ జవాబు ఇచ్చాడు అన్వర్.

మళ్ళీ నిశ్శబ్దం.

ఎక్కా పూల్‌బాగ్ దాటి, కెనాల్ రోడ్డు లోకి మళ్ళింది.

''మీ జీవిత రక్షణ కొరకు జీవిత బీమా.'' ఎల్. ఐ. సి. బిల్డింగ్.

రెండు చేతుల మధ్యగా ఆరిపోకుండా వెలిగే దీపం.

ఈ అన్వర్ గానం ఆరిపోతే, ఆ గాజుల గలగలల గతేమిటి?

అన్వర్ షాదీచేసి ఉంటాడా?

ఎన్ని వేలకో?

ఇంతకీ ఈ బ్యూటీ అన్వర్ కూతురా లేక మూడో భార్యా?

హఠాత్తుగా అన్వర్ తన బొంగురు గొంతుకతో ఒక గజల్ అందుకున్నాడు.

సి. హెచ్. ఆత్మా స్వరాన్ని గుర్తుకు తెప్పిస్తూ, హృదయాన్ని కెలుకుతూ పాడుతున్నాడు అన్వర్.

''ఫూటీ హీ తసల్లీ దో

కుచ్ ఒక్తో తా ఢల్ జాయే.

ధుంధలీహ ఏహీ లేకిన్

ఐసా మెహ్మాన్ జల్ జాయే.''

కొంపదీసి ఈ అన్వర్ నన్ను ఎనలైజ్ చెయ్యటం లేదు కదా? సాఫ్ట్‌కార్నర్స్‌తో నిండి ఉన్న విశాల హృదయమే అంత లోతుగా, అందంగా, ఆత్మ వికసించేలా పాడగలదు.

అన్వర్ ఇప్పుడు ముసలాడు. కానీ, జవానీలో కథానాయకుడే అయి ఉండాలి.

ఐ మైట్ బీ రాంగ్. రొమాంటిక్ పీపుల్ నెవర్ గ్రో ఓల్డ్.

సజ్జనాలు, బాబుభావాలగాళ్ళు ముప్ఫై ఏళ్ళకే అరవై ఏళ్ళ ముసలితనాన్ని కొని తెచ్చుకుంటారు. నా భ్రమ కానీ, అన్వర్‌తో ఆ అందాలరాణి ఆనందంగానే ఉందేమో?

ఒల్ ఈజ్ గోల్డ్!

మళ్ళీ అన్వర్ గొంతు వినిపిస్తోంది.

అన్వర్ గొంతుకి నా చెవులు బందీ అయితే, అన్వర్ బుజాల మీదుగా ఆ బురఖా బ్యూటీ ( పేరేమిటో? ) ని చదవటానికి ప్రయత్నిస్తున్నది నా మెదడు.

ఆమెని అందగత్తెలలో జమ కట్ట వచ్చును.

ఇంతటి సిరిన్ బ్యూటీని బురఖాలలో దాచటం ఫూలిష్!

ఆకాశంలో మబ్బుల మాటున మరులు గొల్పేలా చందమామ. మమతలోని మాధుర్యాన్ని మత్తెక్కేలా అందించే వెన్నెల.

ఆమెకీ, నాకూ మధ్య నిశీథిలా ఆమె వల్లని బురఖా!

చల్లని గాలి వీచింది!

ఆమె ముఖం ముందరి పలచటి పరదా కొద్దిగా పక్కకి తొలిగింది. ఆమె తొలగిన పరదాని సరిచేయటానికి ప్రయత్నించ లేదు!

ఆమె తెగించి నన్ను ఒక్క లిప్తపాటు చూచి, చటుక్కున చందమామ వంక దృష్టిని మరల్చింది.

ఆ చూపులో ఎన్నో భావాలు.

ఆమె కళ్ళు మెరుస్తున్నాయి ( వాటిలో నీళ్ళా? )

ఆమె చూపు నన్ను ఎక్కడికో లోతుగా తెలియని లోకాలలోనికి లాక్కుపోతూంది.

ఆ చూపు. .ఆ కళ్ళు...ఆ కళ్ళలో...

* * *

ఆ కళ్ళలో సుమ కనిపిస్తోంది.

ఎంత పచ్చి నిజం చెప్పింది సుమ!

శివరామ్ సుమకి ఇవ్వగలుగుతున్న సుఖం, తృప్తి, శాంతి నేను శారదకి ఇవ్వగలనా?

సుమ చాలా తెలివైనది.

శివరామ్ సుమని...కమల చలపతిని... శారద నన్ను ... నేను ... అంతా ప్రేమ గొలుసు.

చెయిన్ ఆఫ్ లవ్వర్స్.

నాకు ఎప్పటికీ అర్థం కానిది.

నేను నిజంగా ఎవరిని ప్రేమించి నట్టు?

ఎవరిని?

హూమ్ డిడ్ ఐ రియల్లీ లవ్?

శివరామ్‌లో బోళాతనం ఇంకా అలాగే ఉంది.

పసిపాప అమాయకత్వం.

జీసస్ ఎవరో, జూడాస్ ఎవరో తెలుసు కోలేని అమాయకత్వం.

పది సంవత్సరాల తరవాత శివరామ్ తేలిగ్గా, కాజువల్‌గా చెప్పిన థ్రిల్లింగ్ న్యూస్ నా హృదయంలో గతాన్ని, దాని సంభూతుల్ని, మరిచిపోయా ననుకుంటున్న సుమని గుర్తుకి తెచ్చి చిత్రవధ చేస్తోంది నా హృదయాన్ని.

నా ఎక్స్‌ప్రయిజ్ విజిట్ శివరామ్, సుమలని ఆశ్చర్యానందంలో ముంచి వేసింది. వాళ్ళ 'ప్రేమ పంట' మున్నా. కానీ, శివరామ్ సి.పి.ఐ. (ఎమ్. ఎల్.) ఏక్టివిస్టు. బాంక్‌లో యూనియన్ సెక్రటరి. ప్రొమోషన్స్, లగ్జరీలకు బై బై చెప్పి సింపుల్‌గా లీడ్ చేస్తున్నాడు లైఫ్‌ని. సుమమాత్రం ఉన్నదానిలో లగ్జరీలతో ఇంటినీ, ఒంటినీ అలంకరించి సింపుల్ బట్ స్వీట్‌గా, క్లీన్‌గా, వాళ్ళది 'హాపీ హోమ్' అనిపించేలా తంటాలు పడుతూంది!

చింత చచ్చినా పులుపు చావదు!

---

మనం ఈ ప్రపంచాన్ని ఎంతయినా ద్వేషించవచ్చు. కాని, అది లేకుండా మాత్రం మనలేము.

—బేరన్ వెస్సెన్‌బర్గ్

* * *

ప్రపంచంతో సంబంధం ఏర్పడినప్పుడు హృదయం బద్దలు కావచ్చు; లేదా కరడు కట్టవచ్చు.

—షామ్‌ఫర్ట్

---

మీటింగులు, కాన్ఫరెన్సులు అంటూ శివరామ్ ఎప్పుడూ బిజీ.

నేను, సుమ ఫ్రీ బర్డ్సులా తిరిగాం.

నా ఇంటర్వ్యూ అయిన మరునాడు శివరామ్‌ని బాంక్‌లోనే కలిశాను. ఇద్దరం కలిసి ఇంటికి వస్తున్నప్పుడు చెప్పాడు శివరామ్.

"సుమ చాలా ప్యూర్. గొప్ప నిక్కచ్చి మనిషి. నా దగ్గర ఏమీ దాచదు. ఐ లవ్ హెర్ మోడెస్టీ — ఒకనాడు సుమ, నేను చిన్న పిసరు గొడవ పడ్డాం. టు టెల్ యూ ద ట్రూత్ — సుమకి చలపతి అంటే చిన్న పిసరు 'ఇది' అని నాకు అనుమానంగా ఉండేది. అదే ఒకనాడు మాటల్లో అన్నాను— 'ఎంతైనా, సుమా, యూ హేవ్ ఎ సాఫ్ట్ కార్నర్ ఫర్ చలపతి' అని.

తారాజువ్వలా లేచింది సుమ నా మీదికి!

'ఉన్న మాట అంటే ఉలుకు' అన్నా న్నేను.

'ఉన్న మాట అనలేదు కాబట్టే ఉలుకు' అంది సుమ. అంతటితో ఊరుకోకుండా 'శివరామ్—ఇప్పటికయినా లెట్ మీ టెల్ యూ ద ట్రూత్ — చాలా రోజులుగా మనస్సులో దాచుకున్నాను. ఐ హేవ్ ఎ సాఫ్ట్ కార్నర్ ఫర్, రాజా— కుడ్ యూ ఎవ్వర్ గెస్?' అంది సుమ.

నేను సుమ ఫ్రాంక్‌నెస్‌కి నిర్ఘాంత పోయాను.

ట్రూత్ ఈజ్ బిట్టర్.

'బట్ ట్రూత్ ఈజ్ బ్యూటీ' అంది సుమ నిర్వికారంగా.

'రాజా, సుమ హృదయం చాలా పవిత్రమైనది. తనలోని కుళ్ళుని కడిగేసుకుని నిర్మలంగా ఉంటుంది సుమ. షి ఈజ్ సో క్లీన్, సో ప్యూర్, ద టీజ్ వై ఐ లవ్ హెర్ సో మచ్ ...

ఐ లవ్ హెర్ ... ఐ లవ్ హెర్' అంటున్న శివరామ్స్ గొంతు.

* * *

అన్వర్ గొంతు ఆగిపోయింది.

మళ్ళ కాస్సేపు నిశ్శబ్దం.

నా హృదయంలో మరో కవాటం తెరుచుకుంది. అందులోనికి బురఖా బ్యూటీ ప్రవేశించింది.

నాకు ఒకటే హృదయమున్నా, దానికి ఎన్నో కవాటాలు ఉన్నా యంటుంది శారద.

బురఖా బ్యూటీ చూపుకోసం, ఆ చూపులోని అర్థాన్ని ఆరాతీయటం కోసం ఏదో తహ తహ.

ఏవో అనుమానాలు.

ఈ డకోటాగాడు డెఫినిట్‌గా 'డావ్ సెల్'లా కనిపిస్తున్న ఈ అబలతాలూకు ముసలి మొగుడేనేమో?

ఇంతలో ... ఉన్నపాటున అన్వర్ కాళ్ళూ చేతులూ కొట్టుకుంటూ నా ఒడిలోనికి ఒరిగిపోయి, కాళ్ళు ఎక్కా వాడివైపుకి ఎగదన్నేసి పడిపోయాడు.

నోట్లోంచి నురగ.

"క్షమించండి. అప్పుడప్పుడు ఇలా ఫిట్స్ వస్తూ ఉంటాయి" అంది ఆమె హిందీలో. అన్వర్ పెదవులని తన రుమాలుతో తుడుస్తూ, నా తొడ మీద తన రెండవ చేతిని ఉంచింది ఆమె! ( ఇన్‌సిడెంటల్‌గానో, లేక ఇన్నర్ అర్జ తోనో! )

ఎక్కా రైల్వే క్రాసింగ్ దాటుతూంది.

కుదుపుకి ఈ సారి ఆమె నా భుజాల్ని పట్టుకుంది. ఆమె చేతులని నా బుజాల మీంచి తొలగించి, ఎక్కావాడిని బండి ఆపి, మంచినీళ్ళు తీసుకురమ్మని చెప్పాను.

వాడు బండి దిగి తన సీటు క్రింద నించి చిన్న అల్యూమినియం చెంబు తీసి, ఎక్కడి నుంచో నీళ్ళు తీసుకుని వచ్చాడు.

అన్వర్ ముఖం మీద చల్లటి నీటిని కొద్దిగా చల్లి, అతనిచేత కొద్దిగా నీటిని తాగించాను. కొద్దిసేపట్లో అన్వర్ తేరుకున్నాడు.

నా కోల్డ్‌నెస్‌కి ఆ అమ్మాయి డిస ప్పాయింట్ అయినట్లుంది — ఇదంతా తనకేం పట్టనట్లు ఎటో శూన్యంలోనికి చూస్తోంది.

నా గమ్యం దగ్గర పడుతూంది.

ఇంకేముంది? క్షణాలలో నేను దిగి పోవాలి!

"లాల్ బంగ్లా ఆగయా సాబ్ !" ఎక్కా వాడి పిలుపుతో బండి ఆగింది.

నేను బండి దిగాను.

కాలు తిమ్మిరెక్కి సరిగ్గా నడవలేక దిగిన చోటనే నిలబడి రెండు రూపాయల నోటుని ఎక్కావాడికి అందించాను.

ఎక్కా ముందుకి సాగిపోతూంది.

ఎక్కాలో ఎంకిపిల్లలా ఆమె..

నేను దిగిన చోటనే ఇంకా నిలుచుని ఉన్నాను. ఆమె చివ్వున వెనుదిరిగి చూసింది నా కేసి.

ఆ ఊపుకి ఆమె ముఖం ముందరి పరదా పక్కకి తొలిగింది.

ఆమె నా కేసి చూస్తోంది.

జాలిగొల్పేలా ఆ కళ్ళు!

గుర్రపు డెక్కల సవ్వడి దూరమవుతున్నకొద్దీ నా మనస్సు భారమవుతూంది.

వివేకం కోల్పోయి, చేష్టలుడిగిన స్థితిలో గుడిపాటి గురువు గారి 'హంపీ కన్యలు' గుండెల్లో మెదిలింది.

"ఇది ఆమె పూర్వజన్మ దోషమా, నా పూర్వజన్మ పుణ్యమా, రెంటి ఐక్యమా? నిజమేమో ఈ అదృష్ట మనేదీ, ఈ కర్మ సిద్ధాంతమూ! కోరనిదే, ప్రయత్నించనిదే గుమ్మంలోకి వచ్చి ప్రేమభిక్షం యాచిస్తారు కన్యలు! ప్రయత్నించి, సంపాదించిన ప్రియురాళ్ళని విషపు నవ్వులతో ఏ బొండుప్లీడరో తన్నుకుపోతాడు!"

రాతిగుండెతో రాస్కెల్‌వి వెతుక్కుంటూ వెళ్ళేసరికి, అనుకున్నట్లుగానే రాస్కెల్‌కి బదులు రాకెట్ తాళం స్వాగతం పలికింది. హృదయంలో ఒక మూల ఎక్కడో చిన్న రిలీఫ్‌లా అనిపించి తేలికపడింది.

ఈ వేళ ఒంటరిగానే గడపాలి.

నన్ను నేను పరిశోధించుకుని చాలా రోజులయింది.

సెల్ఫ్ ఎనాలిసిస్‌కి అన్‌ఎక్స్‌పెక్టెడ్ అవకాశం!

వెనక్కి తిరిగి, సిగరెట్టు ముట్టించి నడక మొదలు పెట్టాను.

పూల్‌బాగ్ దగ్గర రిక్షా దిగుతూ కనిపించాడు చలపతి,

వెనకనుంచి వెళ్ళి వాడి మెడమీద నా రెండు చేతులనీ ఉంచి, "పోల్చుకుంటావా, గొంతు పిసకమంటావా, పతి?" అన్నాను. పదేళ్ళ తరవాత పతి దర్శనం నన్ను నిజంగానే ఎక్సయిట్ చేసింది. కాస్సేపు గుడ్లు మిటకరించిన పతి — "ఒరే ... ఒరే ... నువ్వట్రా, రాజా? ఏమిటీ వేషం? శైలాతో లవ్ మేకింగా?" అన్నాడు.

"ఛాన్సు తప్పిపోయింది, గురూ. రేపే విగానం, గెడ్డం గీసేస్తాను."

"ఇంతకీ నువ్వు ఇంకా సింగిల్‌గానే ఉన్నావా? లేక ..."

"త్వరలో శారద నా భార్య కాబోతోంది."

"కంగ్రాట్స్ ... నేను తండ్రి దశలోనికి మారి సుమారుగా ఎనిమిది ఏళ్ళు కావస్తోంది. ఎల్. ఐ. సి.లో ఆఫీసర్‌గా ప్రమోషన్ మీద విజామాబాద్ నించి ఇక్కడికి విసిరివేయబడి మూడు నెలలయింది. పిల్లలు తెలుగు, హిందీ, ఇంగ్లీషు కలిపి పచ్చి బూతులు మాట్లాడుతున్నారు. కమలని కూడా చూద్దువుగాని, పద. ఇక్కడే మా క్వార్టర్సు" అంటూ నన్ను వాళ్ళ ఇంటికి లాక్కుపోయాడు.

ఫుల్ స్పీడుతో ఆలోచిస్తూ పోతున్న నాకు రెడ్ సిగ్నల్‌లాగ, సైంధవుడి అడ్డులాగ చలపతి!

"ఇంతకీ నువ్వు ఇక్కడ వెంగబెడుతున్న ఉద్యోగం?" పతి ప్రశ్న.

"నేను కూడా ఒక సంవత్సరం అవుతుంది ఇక్కడ క్రైస్ట్ చర్చ్ కాలేజీలో హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ ఇన్ సైకాలజీగా చేరి. ఇంటర్వ్యూకి వచ్చినప్పుడు శివరామ్ ఇంట్లో దిగాను."

"ఏమిటీ?! చెప్పావు కావు. శివరామ్ కూడా ఇక్కడే ఉన్నాడా? ఎప్పుడూ, ఎక్కడా కనిపించలేదే? ఎక్కడ ఉద్యోగం?"

"రిజర్వ్ బాంక్‌లో."

"పెళ్ళయిందా?"

"సుమతో."

"పిల్లలూ?"

"ఒక కొడుకు."

"పేరు?"

"మున్నా."

"పెళ్ళికి పిలిచాడు కాదు — బాస్టర్డ్."

"సింపుల్‌గా వాళ్ళిద్దరూ రిజిస్టర్ మారేజీ చేసుకున్నారు. వాళ్ళ పెళ్ళికి సాక్షి సంతకాలు పెట్టిన ముగ్గురిలో నేను ఒకడిని.

కానీ, నేను ఈ ఊరు వచ్చి, ఉద్యోగంలో చేరిన రెండు నెలల్లోగా శివరామ్ కోరి కలకత్తాకి బదిలీచేయించుకున్నాడు."

"కోరి బదిలీనా? !" పతి ఆశ్చర్యం!

అవునన్నట్లు నేను తల ఊపాను.



"నాగాస్తంభము" (సింహాచలం)
ఫోటో — సీతారాజారావు (విశాఖపట్నం-2)

"కారణం?" కాలింగ్ బెల్ నొక్కుతూ అడిగాడు పతి.

"జస్ట్ గెస్ ..."

పతి నా కళ్ళలోకి సూటిగా చూశాడు.

"నువ్వు మమని ..."

తలుపు తెరుచుకొంది.

పిల్లల్లో కమల పోలికలు కొట్టవచ్చినట్లు కనిపిస్తున్నాయి.

"రాజా వచ్చాడు, కమలా!" పతి కేక.

"మాతృత్వం మార్పుని తేలేదు" అన్నాను సన్నగానే ఉన్న కమలని చూసి.

నా కాంప్లిమెంట్‌కి చిన్నగా నవ్వి, టీ కలుపుతూంది కమల.

"శారదని పరిణయ మాడబోతున్నాడట. పెళ్ళికి పిలవటానికి వచ్చాడు పెండ్లికొడుకు." పతి ఇంట్రొడక్షన్.

"ఎప్పుడు పెళ్ళి?" కమల కుతూహలం!

"ప్రస్తుతం శారద శానటోరియంలో ఉంది."

"నే నెప్పుడో అనుకున్నాను నిన్ను ప్రేమించినందుకు శారద గుండెకాయ కాస్త పుచ్చిపోతుందని." పతి రిమార్కు.

"చిన్న సవరణ. గుండెకాయ పుచ్చిపోత — లంగ్స్" అన్నా న్నేను ఏడవలేక నవ్వుతూ!

"ఏడిశావులే. సిగ్గులేదు..." పతి ముఖంలో బాధ.

"ఆరు నెలల్లో పూర్తిగా కోలుకుంటుందని డాక్టర్లు అన్నారు. ఇక నే వెళతా."

"అదేమిటి? ! భోజనం చెయ్యనిదే?"

"ఐ విల్ కమ్ ఎనదర్ డే." గుమ్మంటికి అడుగు వేస్తూ అన్నా న్నేను.

"నువ్వు, నీ మూడ్స్ ఇంకా అలాగే ఉన్నాయిరా, రాజా. ఇంతకీ నువ్వెళ్ళేది ఇంటికా లేక బార్‌కా?"

"రెండోదానికే." నా జవాబు.

"సరే, మళ్ళీ తగలడే ముందు ఫోన్ చెయ్యి. బార్ ఎరేంజిమెంటు కూడా ఇక్కడే చేస్తాం." పతి ఆర్డరు.

"రాజులో ఏమీ మార్పు లేదు" అంటూంది కమల.

"పుట్టుకతో వచ్చిన బుద్ధులు..." ★